కార్పొరేషన్ వనరుల వేలం

- నగరపాలక సంస్థకు రూ.16.03 లక్షల ఆదాయం
- రెండు పార్కింగ్ స్థలాల వేలానికి స్పందన కరువు


రెవెన్యూ వేలాలను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ వేలాలు నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించిన వేలం ప్రక్రియను నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పర్యవేక్షించారు. పార్కింగ్ స్థలాలను దక్కించుకునేందుకు పాటదారులు పోటీ పడ్డారు. తద్వారా నగరపాలక సంస్థకు రూ.16.03 లక్షలు ఆదాయం సమకూరిందని కమిషనర్ వెల్లడించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పార్కింగ్ స్థలంతో పాటు వినాయక ఘాట్ పార్కింగ్ స్థలానికి పాటదారులు ముందుకు రాకపోవడంతో ఆ రెండింటిని వాయిదా వేశారు. ఈ వేలాల్లో రెవెన్యూ అధికారి జునీద్, సూపరింటెండెంట్ వాజిద్, ఆర్‌ఐలు తిప్పన్న, ఖలీల్, సుహేయిల్ పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలను దక్కించుకున్న లీజుదారులు

- కింగ్ మార్కెట్, కూరగాయల మార్కెట్ పార్కింగ్ ప్రదేశానికి దరవత్తు రూ.6.35 లక్షలు నిర్ణయించారు. అత్యధికంగా రూ. 6.80 లక్షలు పాట పాడి జీయండీ. ఖాశీం హుస్సేన్ అనే పాటదారుడు దక్కించుకున్నారు.
- కింగ్ మార్కెట్ పక్కనున్న చేపల మార్కెట్ పార్కింగ్ ప్రదేశానికి దరావత్తు రూ.1.35 లక్షలు నిర్ణయించగా అత్యధికంగా రూ.1.45 లక్షలకు పాట పాడి టీజీ రమేష్‌బాబు దక్కించుకున్నారు.
- కిడ్స్ వరల్డ్ పార్కింగ్ ప్రదేశానికి రూ.3.95 లక్షలు దరవత్తు నిర్ణయించగా వై.రామ్‌చరణ్ అనే పాటదారుడు రూ.4.15 లక్షలు హెచ్చు పాడి దక్కించుకున్నారు.
- శ్రీనివాస క్లాత్ మార్కెట్ వద్ద ఉన్న పార్కింగ్ ప్రదేశానికి దరవత్తూ రూ.3.24 లక్షలు నిర్ణయించగా అత్యధికంగా రూ.3.63 లక్షలు పాట పాడి రామ్‌చరణ్ అనే వ్యక్తి దక్కించుకున్నారు.

క్లుప్తంగా

30న ఉగాది ఉత్సవం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 7 గంటలకు ఏ క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఉగాది ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి తెలిపారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ సమన్వయకర్త ఇల్లూరి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యకారిణీ యుగంధర్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని వెల్లడించారు.

వీబీసీ భూముల అమ్మకాన్ని అడ్డుకోవాలి


మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): వీబీసీ (కార్బైడ్) ఫ్యాక్టరీ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అమ్మాలని చూస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన వీబీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో అధ్యక్షుడు గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. ఈ పరిశ్రమకు రూ.2 కోట్ల బకాయి ఉందన్నారు. బకాయిలు చెల్లించాలని కార్మికులు కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. రూ.500 కోట్ల విలువ కలిగిన పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని రూ.100 కోట్లు ఇస్తే ఎందుకు తెరవడం లేదని ప్రశ్నించారు. యూనియన్ నాయకులు అదిశేషన్న, లక్ష్మన్న భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: తెలుగు కళం సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో విశ్వావసు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి పేర్కొన్నారు. ఆరేపల్లి వరలక్ష్మమ్మ, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, ఎలమర్తి భావన, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ బీవీ స్వరూప్‌సిన్హా, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, దాసరి వెంకట రమణ, మద్దిలేటి, మీసాల రఘు, కృష్ణమూర్తి, సయ్యద్ జహీర్ అహమ్మద్ తదితర కవులు పాల్గొని విశ్వావసు నామ సంవత్సర ఉగాదిపై కవితలు వినిపిస్తారని పేర్కొన్నారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనవచ్చని తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 28వ తేదీన పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. జిల్లా పరిషత్ నుంచి కిడ్స్ వరల్డ్ పార్క్ మధ్యలోని యుకాన్ ప్లాజా, సీఎంఆర్ షాపింగ్, భూపాల్ కాంప్లెక్స్, ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

ఆప్కోలో 30 శాతం డిస్కౌంట్

కర్నూలు(అగ్రికల్చర్): ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పర్వదినాలతో పాటు వివాహాది శుభకార్యాలు ఉన్న నేపథ్యంలో జిల్లాలోని ఆప్కో షోరూమ్‌లలో కొత్త డిజైన్లతో చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు డివిజినల్ మేనేజర్ మధుబాబు తెలిపారు. బందరు, రాజమండ్రి, మాధవరం చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, పొందూరు దోవతులు, షర్టింగ్స్, లుంగీలు, టువాళ్లు, డ్రస్ మెటీరియల్ తదితర వస్త్రాలు వచ్చాయని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, రాజమండ్రి, బెడ్‌షీట్స్, పెద్దాపురం పట్టుపంచెలు, పట్టు షర్టింగ్‌లపై 30 శాతం తగ్గింపు సదుపాయం ఉందని వెల్లడించారు. ఎంపిక చేసిన వస్త్రాలపై 50 శాతం వరకు భారీ తగ్గింపు ఉందని, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరుల్లోని అన్ని ఆప్కో షోరూముల్లో ఈ సదుపాయం ఉందని పేర్కొన్నారు. వివరాలకు 9491640862 లేదా 08518 230289 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

అర్హులైన అధ్యాపకులతో బోధన చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులచే బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్ కుమార్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీఈడీ కళాశాలల్లో అడ్మిషన్లు మాత్రం ఫుల్‌గా ఉన్నాయని అయితే అధ్యాపకులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నారని ఆరోపించారు. వంద మంది విద్యార్థులు ఉన్న కళాశాలలో 16 మంది అధ్యాపకులు ఉండాలనే నిబంధన ఉన్నా ఎక్కడా పూర్తిస్థాయిలో టీచింగ్ స్టాఫ్ లేరని విమర్శించారు. బీఈడీ కళాశాలలను నిబంధనల మేరకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, నగర నాయకులు అఖిల్, శివ తదితరులు ఉన్నారు.

లెప్రసీ బాధితులకు మెరుగైన సేవలందించాలి


మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్త కుమార్‌నాయక్

కర్నూలు(హాస్పిటల్): లెప్రసీ వ్యాధిగ్రస్తులకు వివక్ష లేకుండా సేవలందించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఢిల్లీ) ప్రత్యేక పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్ సూచించారు. ఆయన గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలు, వారి హక్కులపై జిల్లా సమన్వయ కమిటీ అధికారులతో చర్చించారు. వారికి ఇంకా మెరుగైన సేవలు అందించేలా సూచనలు చేశారు. అనంతరం కర్నూలులోని ఆదర్శ కాలనీని సందర్శించి లెప్రసీ బాధితులు ఎంత మంది ఉన్నారు, వారికి ఏపీ పథకాలు అందుతున్నాయి, వారికి గుర్తింపు, ఆధార్ కార్డులు ఉన్నాయా అనే వివరాలు సేకరించారు. అనంతరం నందికొట్కూరు రోడ్డులోని అభయగిరికి వెళ్లి లెప్రసీ బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. జాయింట్ డైరెక్టర్(ఎన్‌ఎల్‌ఈపీ) డాక్టర్ సాగర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, కర్నూలు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి


నాగలింగమయ్యకు నియామక పత్రం అందిస్తున్న రాంబాబు

కర్నూలు (అర్బన్): బీసీలను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నందికొట్కూరు నియోజకవర్గ కార్యదర్శిగా భోగినం నాగలింగమయ్యను నియమించినట్లు ఆయన గురువారం తెలిపారు. బీసీ కులాల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఆయనకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ఆర్‌ఎస్‌ఆర్ గోపాల్ మాట్లాడుతూ.. బీసీల కులగణన చేపట్టాలని, బీసీలకు భద్రత కల్పించాలని, వారి హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాగ లింగమయ్య మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

- నేడు విద్యుత్ సౌదా ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నేతలు ..అధికారంలోకి రాగానే వాటిని వేగంగా బిగిస్తున్నారన్నారు. వీటివల్ల ప్రజలకు ఎక్కువ విద్యుత్ చార్జీ వస్తోందన్నారు. అలాగే అధికారంలోకి రాగానే రూ.17 వేల కోట్ల ట్రూఅప్ చార్జీల భారం ప్రజలపై వేశారన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యుత్ సౌధాను ముట్టడిస్తున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దుర్తి: కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన తమ స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. స్థానిక జెడ్పీహైస్కూల్‌లో 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల్లో పట్టణానికి చెందిన నాయకంటి నాగేంద్ర ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ అనారోగ్యంతో మృతిచెందగా స్పందించిన మిత్రులు కుటుంబానికి సాయమందించేందుకు ముందుకొచ్చారు. మొత్తం రూ.50వేలు పోగు చేసి గురువారం మృతుని కుటుంబానికి అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, పూర్వ విద్యార్థులు కుమ్మరి శ్రీనివాసులు, గఫూర్‌మియ్య, వడ్ల మహేశ్ పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో జిల్లా జడ్జి


తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కర్నూలు జిల్లా జడ్జి జి.కబర్ధి, సబ్ జడ్జి శేషాద్రి గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పాస్టర్ మృతిపై విచారణ జరపాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): పాస్టర్ పగడాల ప్రవణ్ మృతిపై ప్రభుత్వ పెద్దలు కలుగజేసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కేకే భవన్ నుంచి సుందరయ్య సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల నుంచి ప్రభుత్వం ప్రవీణ్ మృతిపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. వెంటనే పోస్టుమార్టం నివేదికను విడుదల చేయాలన్నారు. ఇలాంటి చర్యలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా, రామాంజనేయులు, నాగన్న పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలని కర్నూలు బాప్టిస్టు సంఘం ప్రెసిడెంట్ రెవరెండ్ ఎన్.కారెల్ కాంతమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్. జయకాంత్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ


తోఫా కిట్లను అందజేసిన రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ఆదుకోవడాన్ని ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించాలని, పేదలను ఆదుకున్నప్పుడే నిజమైన పండుగ అని ఆయత్ ఫౌండేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని నిరుపేద కుటుంబాలకు ఆయత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆయన రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి సంతోషంగా జీవించాలని కోరుకోవడమే నిజమైన ప్రార్థన అన్నారు. గత పదిహేనేళ్లుగా తాము సొంత ఖర్చుతో పేద కుటుంబాలకు పండుగ కిట్లను అందజేస్తున్నామన్నారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వహీదాబేగం, వాహిద్, సభ్యులు ఆనందరావు, రామమోహన్‌రెడ్డి, వెంకటరాముడు, నాగేశ్వర బాబు, సూర్యకుమార్, జ్యోతిరాణి పాల్గొన్నారు.

ఎన్నికల కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

కర్నూలు: జిల్లాలో జెడ్పీ కో–ఆప్షన్, మండల పరిషత్ కో–ఆప్షన్ ఉప సర్పంచు స్థానాలకు ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షిస్తూ ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా ఎన్నికలు సజావుగా జరిగే విధంగా భద్రతాపరమైన చర్య లు చేపట్టినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు.

ఇద్దరు వైద్యులకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరు వైద్యులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. వీరికి గురువారం జూమ్ ద్వారా డీఎంఈ డాక్టర్ నరసింహం పదోన్నతి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి అనంతపురానికి, డాక్టర్ శ్రీదేవి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు.

పీఆర్‌సీ కమిటీ చైర్మన్‌ను నియమించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చి న హామీ మేరకు ఐఆర్‌ను ప్రకటించాలని, 12వ పీఆర్‌సీ కమిటీ చైర్మన్‌ను ఏర్పాటు చేయాలని అప్టా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, సేవలాల్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సరెండర్ లీవ్‌లు, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2004 సెప్టెంబర్‌కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అలాగే ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీస్ 62 ఏళ్లకు పెంచి రెగ్యులర్ చేయాలని కోరారు.

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహిస్తాం

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెలుగు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మీడి యా భవన్ సమీపంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు వీరాంజనేయులు, రాము, జమ్మన్న, రమేష్, శేఖర్, పరశురాం, నాగేంద్ర, లోకేష్, గొల్ల శేఖర్ పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

కర్నూలు: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పడిగెల రాజశేఖర్ నుంచి తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించాలని అదే ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఎం.లిల్లెమ్మ గురువారం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. రాజశేఖర్ తాను 17 సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నామని, అతని కోసం రూ.15 లక్షల నగదు, 12 తులాల బంగారం ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాజశేఖర్, అతని అన్నదమ్ముల వల్ల తనకు, తన పిల్లలకు హాని పొంచి ఉందని రక్షణ కల్పించాలని కోరారు.

స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న జీవీఎం మోహన్‌కుమార్

కర్నూలు సిటీ: రవీంద్ర, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలు సంయుక్తంగా బిజినెస్ ఐడియా తాన్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, మురళీధర్ రెడ్డి (ఆచార్యులు, కేంబ్రిడ్జ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బెంగళూరు) హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్ మాట్లాడుతూ స్టార్టప్‌లను ప్రోత్సహించడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో ముందుకు వస్తే అందులో పెట్టుబడి పెట్టేందుకు యాజమాన్యం ముందుటుందన్నారు. అనంతరం మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు లాభాలు తెచ్చే విధంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ కేఈ శ్రీనివాసమూర్తి, డాక్టర్ సి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓ దిష్టిబొమ్మ దహనానికి యత్నం

- కలెక్టరేట్ ఎదుట తీవ్ర ఉద్రిక్తత
- ఏఐఎస్‌ఎఫ్ నాయకులను అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు


ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు కలెక్టరేట్ ఎదుట తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, విద్యార్థి సంఘాల మధ్య తోపులాట జరిగింది. చివరకు పోలీసులు విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేసి మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. పోలీసు రాజ్యం నడుస్తోందని, ఎవరైనా ఏమైనా మాట్లాడితే అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్ కాలేజీల యాజమాన్యాలతో కలిసిపోయి అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయన్ను సస్పెండ్ చేసే వరకు పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. నాయకులు శరత్‌కుమార్, అభి, అశోక్, అక్షర, ముని, నాని, శీను, వీరేష్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి


బహుమతుల ప్రదానం చేస్తున్న రెక్టార్ ఎన్‌కేటీ నాయక్, రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు

కర్నూలు కల్చరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌కేటీ నాయక్ సూచించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్ ఉద్భవ్–2025 కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతికతపై అవగాహన పెంచుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం


వేడుకలను ప్రారంభిస్తున్న రోజమ్మ, చిత్రంలో కేజే రెడ్డి తదితరులు

కర్నూలు(సిటీ): నగర శివారులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (చిన్నటేకూరు) వార్షికోత్సవం ఎక్సెల్లా పేరుతో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల చైర్మన్ కేజే రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. మంచి విద్యా ప్రమాణాలు పాటిస్తూ ఉత్తమ శిక్షణ కలిగిన పాఠశాలగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రత్యేక అతిథిగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు ప్రాథమిక దశలో మంచి పునాది ఉంటే భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశముంటుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సెయింట్ జోసెఫ్ స్కూల్ సెక్రటరీ, ట్రెజరీ రోజమ్మ, ఆత్మీయ అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఐజీ వెంకటరామిరెడ్డి మాట్లాడారు. ప్రైమరీ స్థాయిలో ఎంపిక చేసుకునే చదువును బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు మంచి మౌలిక వసతులు ఉన్నాయని, ఇక్కడ చదువుతున్న విద్యార్థుల మేధస్సును అభినందించారు. విద్యార్థుల లోకమంతన్‌లో భాగంగా లోక్ ప్రకృతి, లోక్ విచార్, లోక్ వ్యవహార్, లోక్ వ్యవస్థలను విద్యార్థులు నాటక, కళా ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో బడీరాత్
నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ మనవర మసీదులో బడీరాత్ సందేశం వినిపిస్తున్న కమిటీ ప్రెసిడెంట్ గఫార్ సాబ్ – కర్నూలు

ట్రేడర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): నందవరం మండలం నాగులదిన్నెలో యూరియా బస్తాపై అదనంగా రూ.50 వసూలుచేస్తున్న శివ, కిరణ్ ట్రేడర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో యూరియా కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్మే ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తుగ్గలి: ఎద్దులదొడ్డికి చెందిన రాజు గురువారం తుగ్గలి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా మార్గమధ్యలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న ఇన్నోవా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

బీసీలు సామాజిక సేవలో ముందుండాలి


చంద్రకళా బాయ్‌ను సన్మానిస్తున్న బీసీ నేతలు

కర్నూలు (అర్బన్): బీసీలు సామాజిక సేవలో ముందుండాలని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్ శశికాంత్ ప్లాజా, బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి కార్యాలయంలో సామాజిక సేవా రంగంలో సేవలందించిన కర్నూలుకు చెందిన జె.చంద్రకళా బాయ్‌కి పాండిచ్చేరి యూనివర్సిటీ వారు డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా ఆమెను ఘనాంగా సన్మానించారు. సీనియర్ బీసీనేత గడ్డం రామకృష్ణ, సీహెచ్ మద్దయ్య, అయ్యన్న యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, బోయ శ్రీనివాసులు, ఉయ్యాలవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.